ఆర్టీసీ బస్టాండు ఉన్నా.. లేనట్టే?

- ఏడాది నుంచి నిరుపయోగంగా..
- ఎలక్ట్రికల్ వస్తువులు ధ్వంసం
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం



గుర్రంకొండ ఆర్టీసీ బస్టాండు

గుర్రంకొండ: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి చొరవతో మండల కేంద్రమైన గుర్రంకొండకు ఆర్టీసీ బస్టాండు మంజూరు అయింది. ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారితో పాటు కడప–బె బెంగళూరు రహదారిపై గుర్రంకొండ పట్టణం ఉంది. దీంతో రోజు రోజుకు వ్యాపార కేంద్రంగా గుర్రంకొండ అభివృద్ధి చెందుతోంది. ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు గుర్రంకొండకు వస్తుంటారు. ఇక్కడ ఆర్టీసీ బస్టాండు ఏర్పాటు చేయాలనేది పట్టణ వాసుల దశాబ్దాల కల. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం ఎంపీ, అప్పటి ఎమ్మెల్యే చొరవ తీసుకొని బస్టాండు నిర్మాణానికి స్థల సేకరణ చేయించి నిర్మాణానికి రూ.35 లక్షల నిధులు మంజూరు చేయించారు. గతేడాది బస్టాండ్‌ను ప్రారంభించారు.

మున్నాళ్ల ముచ్చటగా..

ఆర్టీసీ బస్టాండు కథ మున్నాళ్ల ముచ్చటగా ముగిసింది. ఏడాది క్రితం ప్రారంభించినా.. ఇంతవరకు వినియోగంలోకి రాక పోవడం గమనార్హం. ఇప్పటికీ ఒక్క బస్సు కూడా బస్టాండులోకి రావడం లేదు. దీంతో లక్షలాది రుపాయలు వెచ్చించి నిర్మించిన బస్టాండు నిరుపయోగంగా మారింది.

లైట్లు, బల్బులు చోరీ

లక్షలాది రుపాయలు ఖర్చుచేసి నిర్మించిన నూతన ఆర్టీసీ బస్టాండు భవనంలో లైట్లు, బల్బులు చోరీ చేశారు. దుండగులు బస్టాండ్‌లోని ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. ప్రస్తుతం స్విచ్‌బోర్డులోని కేబుళ్లు కిందికి వేలాడుతున్నాయి.

ఆకతాయిల మకాం

ఆర్టీసీ బస్టాండు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయింది. కొంతమంది రాత్రిళ్ల ఇక్కడే గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలు సేవిస్తూ అక్కడే మకాం వేశారు. ఆర్టీసీ బస్టాండు వెనకే ఉర్దూ జెడ్పీహైస్కూల్, ఉర్దూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆకతాయిలు ఆర్టీసీ బస్టాండు వద్ద మకాం వేసి విద్యార్థినులను వేధిస్తున్నారు.

ప్రయాణికులకు అవస్థలు

ఆర్టీసీ బస్టాండు నిరుపయోగంగా మారడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే గంటల తరబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది.

వినియోగంలోకి తీసుకోవాలి



రూ. 35 లక్షలతో గుర్రంకొండలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండును వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి. ఏడాది క్రితం బస్టాండును ప్రారంభించారు. అప్పటి నుంచి అధికారులు పట్టించుకోక పోవడంతో వినియోగంలోకి రాలేదు. అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలి.

– ముక్తియార్ అలీఖాన్, గుర్రంకొండ

మాకు స్వాధీనం చేయలేదు

గుర్రంకొండలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండు భవనాన్ని మాకు స్వాధీనం చేయలేదు. బస్టాండు భవన నిర్మాణానికి సంబంధించిన అధికారులు మాకు స్వాధీనం చేస్తున్నట్లుగా లిఖిత పూర్వకంగా ఇవ్వాలి. అలా ఇస్తే స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం .అధికారుల నుంచి ఉత్తర్వులు రాగానే చర్యలు తీసుకుంటాం.

– అమరనాథ్, ఆర్టీసీ రెండవ డిపోమేనేజర్, మదనపల్లె

విమాన ప్రమాదం కలచివేసింది

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



బి.కొత్తకోట: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్వదేశానికి వెళ్తున్నామన్న ఆనందం, దూరంగా తమ వారిని కలుసుకునేందుకు వెళ్తున్న కుటుంబీకుల సంతోషం క్షణాల్లో ఆవిరై ప్రాణాలు కోల్పోవడం.. వారి కుటుంబాల్లో తీరని ఆవేదన మిగిలిందని అన్నారు. ఎంతో భవిష్యత్తు కలిగిన చిన్నారులు మృత్యువాత పడటం అందరిని ఆవేదనకు గురిచేసిందన్నారు. వారి కుటుంబాలకు దేవుడు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.

ఘోర దుర్ఘటన

మదనపల్లె రూరల్ : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం ఓ ఘోర దుర్ఘటన అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం విమాన ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఘటనలో ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు అల్లాహ్ ధైర్యాన్ని ఇచ్చి తోడుగా నిలవాలని, శుక్రవారం సీటీఎం క్రాస్‌రోడ్డులోని నూరాని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే కూలిపోవడంతో భారతీయులతో పాటు విదేశీయులు మరణించడం బాధాకరమన్నారు. ముతవల్లి మహబూబ్‌బాషా, ఖాదర్, జాకీర్, ఐలు, డిష్‌బాబా, రహమతుల్లా, షంషీర్, షఫీవుల్లా, యూనస్, నవాజ్, షానవాజ్, జబీవుల్లా, రియాజ్, ఖిజార్‌ఖాన్, యాసిన్, అబ్దుల్లా, మసీదు కమిటీ పెద్దలు పాల్గొన్నారు.


ముస్లింలతో మాట్లాడతున్న నిసార్‌అహ్మద్

ఆలయాలు.. ఆధ్యాత్మిక నిలయాలు

మదనపల్లె సిటీ: ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలని సీటీఎం క్రాస్ సర్పంచు బండపల్లి ఈశ్వరమ్మ అన్నారు. మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌లో నూతనంగా శ్రీ సప్పలమ్మ ఆలయం, శ్రీ సీతారామస్వామి ఆలయాలను నిర్మించారు. ఇటీవల సీటీఎం క్రాస్ సర్పంచు బండపల్లి ఈశ్వరమ్మ ప్రత్యేక చొరవ తీసుకుని ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కేవలం 29 రోజుల్లో గ్రామస్తుల సహకారంతో ఆలయాలను పూర్తి చేశారు. భక్తుల సహకారంతో ఆలయాల నిర్మాణాలు పూర్తి చేసినట్లు ఆలయ నిర్మాణకర్త బండపల్లి అక్కులప్ప తెలిపారు. పార్టీలకు అతీతంతగా అందరూ ముందుకు వచ్చారన్నారు. శుక్రవారం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

ప్రయాణికులకు మెరుగైన సేవలు


సిబ్బందికి బహుమతులు అందజేస్తున్న డీఎం

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం డిపో గ్యారేజిలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. మే నెలలో కేఎంపీఎల్ 5.45, ఈపీకే 41.40,ఓఆర్ 75.58 సాధించి రీజియన్లో మొదటి స్థానం నిలిచిందన్నారు. ఉద్యోగుల సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. రీజియన్‌లో రెండో స్థానంలో ఉన్న గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బందిని అభినందించారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజేతలకు నగదు అందజేస్తున్న నిర్వాహకులు

కలకడ : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద చేస్తాయని కలకడ మాజీ సర్పంచ్ షబ్బీర్ అహమ్మద్ అన్నారు. కలకడలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు ప్రాదానం చేశారు. విజేత జట్టుగా కలకడ కొత్తపల్లె సుదర్శన్ జట్టు, రన్నరప్‌గా కలకడ ఫ్రెండ్స్ జట్టు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టుకు రూ.30వేలు నగదు మొమెంటో, రన్నరప్ జట్టుకు రూ.20వేలు నగదు మొమెంటో అందించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు దేహ ధారుడ్యానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. అజాజ్, గౌష్, శివ, బాబు, అమీర్‌ఉల్లా, మహమ్మద్‌జాఫర్, మోహన్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం


రామసముద్రంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

రామసముద్రం: పరిసరాల శుభ్రత ముఖ్యమని ఈవోపీఆర్‌డీ గఫూర్ అన్నారు. రామసముద్రం మండల కేంద్రంలోని బలిజవీధి, బజారువీధుల్లో శుక్రవారం ఈవోపీఆర్‌డీ గఫూర్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులతో మురుగునీటి కాలువలను శుభ్రం చేయించారు. అలాగే దిగవ హరిజనవాడలో తాగునీటి సమస్యపై వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించి తాగునీటి సమస్య పరిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి మునస్వామి నాయక్, పంచాయతీ బిల్ కలెక్టర్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పాడి సంపదతో ఆర్థికాభివృద్ధి


మహిళలకు బహుమతులు అందించిన శ్రీజ మిల్క్ కంపెనీ సిబ్బంది

కలకడ : పాడి సంపదతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని శ్రీజ మిల్క్ కంపెనీ ఏరియా మేనేజర్ స్వామి అన్నారు. శ్రీజ మహిళా మిల్క్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కోన ప్రాంతీయ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీజ పాలు, పాల పాడి, పాల ఉత్పత్తులపై వివరించారు. ఈ కంపెనీలో వందశాతం మహిళలు భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. అధికంగా పాలు అందిస్తున్న 27 మంది మహిళా పాడి రైతులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

రామసముద్రం: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యమని ఎస్‌ఐగా డి.రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం రామసముద్రం ఎస్‌ఐగా డి. రమేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రవికుమార్ రాయచోటి వీఆర్‌కు బదిలీ అయ్యారు. రాయచోటి స్పెషల్‌బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న రమేష్‌బాబు బదిలీపై వచ్చారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకు న్యాయం చేస్తానని, మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కృషి చేస్తానని రమేష్‌బాబు పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దతిప్పసముద్రం: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ మహమూద్ అన్నారు. బి.కొత్తకోట రోడ్డులోని కాలనీ వాసులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఇటీవల ఎంపీపీ మహమూద్‌కు వినతి పత్రం ఇచ్చారు. మండల సమావేశంలో నీటి సమస్యపై ప్రజా ప్రతినిధులు సభా దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ మహమూద్ ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం కొత్తగా బోరు డ్రిల్లింగ్‌కు శ్రీకారం చుట్టారు. మండల గ్రాంట్ ద్వారా బోరుతో పాటు మోటారు, పైపులు, పైప్‌లైన్ సౌకర్యం కల్పిస్తామని ఎంపీపీ తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో ఎంపీటీసీ కార్యం చంద్రశేఖర్ ఉన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో అధిక ఆదాయం


మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

మదనపల్లె రూరల్ : సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ ఖర్చును తగ్గించుకోవడంతో పాటు ఆదాయాన్ని ఆర్జించవచ్చని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సీటీఎం రోడ్డులోని ఏపీఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఈఈ గంగాధరం అధ్యక్షతన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఈ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించి, సామాన్య పౌరులపై కరెంట్ ఛార్జీల భారం తగ్గించేలా కేంద్రప్రభుత్వం సూర్యఘర్ యోజనను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ పద్ధతిలో ఇంటి పైకప్పు నుంచే విద్యుదుత్పత్తి చేసుకోవచ్చన్నారు. ఇంటి అవసరాలు తీరిన తర్వాత మిగిలిన విద్యుత్తుతో అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. 100 చదరపు అడుగుల స్థలంలో 120 యూనిట్లు ఉత్పత్తి చేసే ఒక కిలోవాట్ సామర్థ్యమున్న సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకోవచ్చన్నారు. ఇందుకు సుమారు రూ.60వేల రూపాయలు ఖర్చు అయితే, అందులో 50శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. మిగిలిన సొమ్మును బ్యాంకుల నుంచి రుణం తీసుకోవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీల ద్వారా సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలను తక్కువ ఖర్చుతో ఏర్పాటుచేసుకోవచ్చన్నారు. భవిష్యత్తులో విద్యుత్ ధరలు పెరిగినా సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ ఖర్చు స్థిరంగా ఉంటుందన్నారు. రిటైర్డ్ ఈఈ విజయభాస్కర్‌నాయుడు, డిప్యూటీ ఈఈ అర్బన్ హరికుమార్, రూరల్ ఈఈ సురేంద్రనాయక్, ఏఈలు అజయ్‌బాబు, రమేష్, ముజమిల్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..

మదనపల్లె: మదనపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డులో నెలకొన్న దుర్గంధ పరిస్థితులు, పారిశుద్ధ్య లోపంపై శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన 'కంపు..కంపు' కథనంపై మార్కెట్ కార్యదర్శులు స్పందించారు. కార్యదర్శి జగదీష్, సహాయ కార్యదర్శి అభిలాష్ చర్యలు చేపట్టారు. పారబోసిన టమాటాలు, చెత్తచెదారం తొలగింపు పనులు ప్రారంభించారు. ఇక్కడ వ్యర్థాలను డంపింగ్ యార్డులు తరలిస్తున్నారు. తొలిరోజు కొద్దిపాటి పనులు చేయగా ఈ పనులను కొనసాగిస్తున్నట్టు మార్కెట్ అధికారులు తెలిపారు.


వ్యర్థాలను తొలగించిన మార్కెట్ యార్డు సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలి

మదనపల్లె రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం అందించడం జరుగుతుందని, ఐదేళ్లలోపు పిల్లలందరినీ తప్పనిసరిగా కేంద్రాలకు పంపాలని సీడీపీఓ నాగవేణి అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐసీడీయస్ కార్యాలయంలో అర్బన్, రూరల్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవేణి మాట్లాడుతూ...ప్రీ స్కూల్ పిల్లల నమోదు పెంచడం, నాణ్యతతో కూడిన ప్రీ స్కూల్ విద్యను అందించడం, స్కూల్ రెడీనెస్ కార్యక్రమాలు, ఐదేళ్ల పిల్లల్లో లోపపోషణను గుర్తించడం, వారి పోషణ స్థితిని మెరుగుపరచడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

తంబళ్లపల్లె: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని స్థానిక సీడీపీఓ సుజాత ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలో కురబలకోట, తంబళ్లపల్లె, పెద్ద మండ్యం మండలాల్లోని 173 అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు ప్రీ స్కూల్ పుస్తకాలు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించాలన్నారు. మూడేళ్లు నిండిన ప్రతి బిడ్డను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చుకోవాలన్నారు. ప్రీ స్కూల్ ప్రయోజనాలు, సిలబస్, పీపీ వన్, పీపీ టు పుస్తకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు రమణమ్మ, చంద్రకాంతమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి స్థలం కేటాయించండి

మదనపల్లె రూరల్ : కోళ్లబైలు–1 గ్రామపరిధిలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం మండల తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఏకమై ప్రభుత్వస్థలంలో అంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసుకున్నామని, అయితే ఓ వ్యక్తి దురుద్దేశంతో రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో ఆటంకం ఏర్పడిందన్నారు. విగ్రహం ఏర్పాటుచేసిన స్థలం ప్రైవేట్ భూమి కాదని, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించాలన్నారు. విగ్రహం ఏర్పాటుచేసిన ప్రాంతంలో 4 కుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే గ్రామస్తులు చందాలు వేసుకుని గుడిని నిర్మించుకుంటామన్నారు. గ్రామస్తుల వినతిపై స్పందించిన తహసీల్దార్, స్థానిక వీఆర్వో, ఆర్‌ఐను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితి తెలపాల్సిందిగా ఆదేశించారు.

మలేరియా నివారణ.. మన బాధ్యత


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

పీలేరు రూరల్: మలేరియా నివారణ మనందరి బాధ్యత అని తలపుల పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. మలేరియ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పీలేరు బండ్లవంక వీధిలో సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రసంగించారు. ప్లాస్మోడియం పరాన్నజీవి సంక్రమణక లిగిన ఆడ అనాఫిలాస్ దోమ వలన మలేరియ వ్యాపిస్తుందని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. చలి, జ్వరం, తలనొప్పి, వంటిలక్షణలు కలిగిన వారు స్థానిక ప్రథమిక ఆరోగ్యకేంద్రంలో కానీ, పీహెచ్‌సిలో కానీ రక్తపరీక్షలు చేయించుకుని ఉచితంగా చికిత్స, మందులు పొందాలని కోరారు. డిప్యూటీ హెచ్ఈఓ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, రెడ్డెప్ప, ఏఎన్‌యంలు ప్రమీల, భార్గవి, చంద్రకళ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అర్హులైన విద్యార్థులందరికీ తల్లికి వందనం ఇవ్వాలి

మదనపల్లె సిటీ: అర్హులైన విద్యార్థులందరికీ తల్లికి వందనం నిధులు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్.నరసింహా డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ సర్కిల్‌లో తల్లికి వందనం ఎలాంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలని కోరుతూ నిరసన తెలియజేశారు. అధికారంలోకి రాకముందు విద్యార్థులకు అండగా నిలబడతానని ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు రూ.15 వేలు తల్లి ఖాతాల్లో జమ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారని ఆరోపించారు. ప్రజలను మోసం చేయడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. తల్లికి వందనంలో రూ.2వేలు పాఠశాలలు, కాలేజీల అభివృద్ధికి ఖర్చు చేస్తామని ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా తల్లికి వందనం రూ.15 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అఫ్రిద్, నాయకులు జయబాబు, సమీర్, సుల్తాన్, బన్నీ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : విద్యార్థులకు అందరికీ తల్లికి వందన పథకం అమలు చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ డిమాండ్ చేశారు. శుక్రవారం పీలేరులో ఆయన ప్లేకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమృత్‌తేజ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హామీలు చూస్తే కోటలు దాటాయని, అమలులో మాత్రం గడప కూడ దాటలేదని ఎద్దేవాచేశారు. విద్యార్థులకు న్యాయం చేయకుంటే ఎన్ఎస్‌యూఐ తరుపున కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చీకటిపల్లి సాయి సంపత్‌కుమార్, చందు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిమ్మనపల్లె : విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ నాగరాజ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెండవ శనివారం సందర్భంగా నిమ్మనపల్లి మండలంలోని విద్యుత్ కేంద్రాలలో, ఉప కేంద్రాలలో మరమ్మతులు, విద్యుత్ లైన్‌లలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు, రైతులు విద్యుత్ అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు .

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి

పీలేరు రూరల్: పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా హరినాథ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన కుమార్‌రెడ్డి వాల్మీకిపురం మార్కెట్ కమిటీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. కుప్పం మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న హరినాథ ఎఫ్ఏసీ ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎస్‌బీఐలో రక్తదాన శిబిరం

మదనపల్లె సిటీ: బ్యాంకర్స్ డే సందర్భంగా స్థానిక సీటీఎం రోడ్డులోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బ్యాంకు ఆఫీసర్లు, సిబ్బంది 45 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సతీష్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ నవీన్, డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక

మదనపల్లె: ఫెడరేషన్ ఆఫ్ ప్రైవేటు హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కమిటీలో మదనపల్లెకు చెందిన వైద్యులు, ఏపీ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఏవీ.సుబ్బారెడ్డికి చోటు దక్కింది. ఈ కమిటీకి నూతనంగా జరిగిన ఎన్నికల్లో తనను జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొన్నట్టు శుక్రవారం సుబ్బారెడ్డి మీడియాకు తెలిపారు.